




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం

14 ఏప్రిల్ 2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-




# లోక్‌సభ సీట్ల పెంపుపై రేవంత్ ఆగ్రహం

- జనాభా పేరుతో సీట్ల పెంపు ప్రయత్నాలపై తీవ్ర విమర్శలు
- మహిళా రిజర్వేషన్ల పేరుతో రాజకీయ లాభం చూస్తోందని ఆరోపణ
- దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళన
- అఖిలపక్ష చర్చల తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచన
- బీజేపీలో మహిళలకు స్థానం లేదని ఘాటు వ్యాఖ్యలు
- నియోజకవర్గాల పునర్విభజనపై పోరాటానికి సిద్ధమని హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 13: జనాభా ఆధారంగా లోక్‌సభ స్థానాలను పెంచే ప్రయత్నాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని, అఖిలపక్ష సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు దేశవ్యాప్తంగా మద్దతు ఉన్నప్పటికీ, అదే పేరుతో లోక్‌సభ సీట్ల పెంపును అనుసంధానించడం సరికాదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్ల పెంపు రెండూ వేర్వేరు అంశాలని ప్రతి ఒక్కరికి తెలుసని ఆయన అన్నారు. అసెంబ్లీ స్థాయిలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం అంగీకరిస్తుందని, కానీ జనాభా ఆధారంగా లోక్‌సభ స్థానాల పెంపు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ విధానం భవిష్యత్తులో దేశ సమతుల్యతను దెబ్బతీసే

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణలో ఈ నెల 22 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె



## హర్మూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు: ఇరాన్ రాయబారి



## తక్షణమే రూ.144 కోట్లు డిపాజిట్ చేస్తే కుప్పకూలిపోతాం: ఢిల్లీ హైకోర్టులో స్పైస్ జెట్



## ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య అవగాహనే

**: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

తెలంగాణలో పొత్తుల అంశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కీలక ప్రకటన చేశారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించిన నేపథ్యంలో నిర్మల్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని, ఒంటరిగానే పోరాడుతుందని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య కుదిరిన అవగాహన మాత్రమేనని, పార్టీ పరంగా ఎలాంటి అధికారిక పొత్తు లేదని ఆయన వివరణ ఇచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీ పోలీసు బలంతో, గుండాయిజంతో భయభ్రాంతులకు గురిచేసినప్పటికీ, ప్రజలు బీజేపీకే పట్టం కట్టారని

# సరికొత్త చరిత్ర దిశగా భారత్: ప్రధాని మోదీ

- మహిళా రిజర్వేషన్ చట్టంపై కీలక ప్రకటన
- దేశ ప్రజాస్వామ్యానికి మహిళలతో మరింత బలం
- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుకు ముందడుగు
- ప్రతి రాజకీయ పార్టీ మద్దతు అవసరమని పిలుపు
- మహిళల నాయకత్వంతో అభివృద్ధి పెరుగుతుందని విశ్వాసం
- త్వరలో అమలు దిశగా చర్యలు చేపడతామని స్పష్టం



న్యూఢిల్లీ: చట్టసభల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరలో చట్టరూపం దాల్చనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా భారతదేశం సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన నారీ శక్తి వందన్ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఇది ఈ శతాబ్దంలోనే అత్యంత కీలకమైన నిర్ణయాల్లో ఒకటిగా నిలుస్తుందని చెప్పారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను మహిళలు మరింత బలోపేతం చేస్తారని ప్రధాని అన్నారు. మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ బిల్లును ముందుకు తీసుకువచ్చే సమయం ఆసన్నమైందని తెలిపారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర మరింత కీలకమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల నాయకత్వంలో అభివృద్ధి వేగం పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలోని

(మిగతా 2వ పేజీలో)



# ఇది చొరబాటుదారులను తరిమికొట్టే సమయం

- బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా
- నక్సలిజాన్ని పూర్తిగా అణిచివేశామని ప్రకటన
- చొరబాట్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- మమతా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని హామీ
- రాబోయే ఎన్నికల్లో భారీ విజయంపై ధీమా

రాణిగంజ్ : దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అణిచివేసిన తరువాత ఇప్పుడు చొరబాటుదారులను తరిమికొట్టే సమయం వచ్చిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు హింస, బెదిరింపులకు బదులుగా ఓట్లతో సమాధానం చెబుతారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుత ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారని, మార్పు కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రాబోయే ప్రభుత్వం తమ పార్టీదేనని ధీమా

(మిగతా 2వ పేజీలో)

# తక్షణమే రూ.144 కోట్లు డిపాజిట్ చేస్తే కుప్పకూలిపోతాం: ఢిల్లీ హైకోర్టులో స్పైస్‌జెట్

న్యూఢిల్లీ: కళానిధి మారన్, ఆయనకు చెందిన కేఏఎల్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో తమకు చాలాకాలంగా నడుస్తున్న వివాదంలో, రూ.144.5 కోట్లను తక్షణమే డిపాజిట్ చేయాలని ఒత్తిడి తెస్తే తాము కుప్పకూలుతామని ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్ జెట్ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఈ నగదు డిపాజిట్‌కు సంబంధించి సంస్థ చెల్లింపు గడువు ఏప్రిల్ 14వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో స్పైస్ జెట్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా విమాన సర్వీసులకు ఆటంకం కలగడం, విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల నగదు కొరత ఏర్పడిందని స్పైస్ జెట్ కోర్టుకు తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ భారీ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాల్సి వస్తే ఆర్థికంగా దెబ్బతిని తమ వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని వాపోయింది. నగదుకు బదులు గురుగ్రామ్‌లో తమ కంపెనీకి ఉన్న ఎకరం వాణిజ్య భూమిని సెక్యూరిటీగా పెట్టుకోవాలని కోరింది. ఈ భూమిని అత్యవసరంగా విక్రయిస్తే 50 శాతం తక్కువ ధరకు అమ్మవలసి వస్తుందని, నష్టానికి ఆస్తులను అమ్ముకునేలా బలవంతం చేయవద్దని కోరింది. వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. స్పైస్ జెట్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 2015లో స్పైస్ జెట్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో కళానిధి మారన్ తన 58.46 శాతం షేర్లను స్పైస్ జెట్ వ్యవస్థాపకుడు అజయ్ సింగ్ పేరుపై మార్చారు. తాను పెట్టుబడి పెట్టిన రూ.679 కోట్లకు బదులు కన్వర్టబుల్ వారెంట్స్, ప్రిఫరెన్స్ షేర్లను ఇచ్చేలా ఇరువురి మధ్య ఒప్పందం కుదిరింది. తనకు షేర్లు ఇవ్వకపోవడంతో కళానిధి మారన్




మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. వడ్డీతో సహా కళానిధి మారన్‌కు చెల్లించాలని 2018లో ఈ ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ వివాదానికి సంబంధించి రూ.144.51 కోట్లను కోర్టులో డిపాజిట్ చేయాలని ఢిల్లీ హైకోర్టు గతంలో స్పైస్ జెట్‌ను ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ స్పైస్ జెట్‌కు ఊరట దక్కలేదు. దీంతో ఢిల్లీ హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది.

# హర్మ్యూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు: ఇరాన్ రాయబారి



హర్మ్యూజ్ జలసంధి గుండా వెళుతున్న భారతీయ చమురు ట్యాంకర్ల నుంచి తాము ఎలాంటి టోల్ ఫీజును వసూలు చేయడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత క్లిష్ట సమయంలోనూ సానుకూల సంబంధాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. భారత్‌తో ఉన్న మైత్రి కారణంగా రవాణా ఉచితంగా సాగుతోందని అన్నారు. అమెరికాతో చర్చలు పునఃప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ తమ డిమాండ్లకు అనుకూలంగా స్పందించాలని స్పష్టం చేశారు. మా షరతులను అమెరికా అంగీకరిస్తే, మరో విడత చర్చలు సాధ్యమవుతాయని అన్నారు. ఇటీవల తాత్కాలిక యుద్ధ విరమణ అనంతరం చర్చల సందర్భంగా అమెరికా అంగీకార యోగ్యం కాని డిమాండ్లు తమ ముందు ఉంచిందని పేర్కొన్నారు. అందుకే చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిందని అన్నారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై మహమ్మద్ ఫతాలీ స్పందిస్తూ, ఇరాన్ సామర్థ్యం గురించి వాషింగ్టన్‌కు తెలుసని అన్నారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో, భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.




## తెలంగాణలో ఈ నెల 22 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె


హైదరాబాద్, ఏప్రిల్ 13: : తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 22వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత నెల 13వ తేదీన యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపింది. కానీ యాజమాన్యం నుంచి ఎలాంటి హామీ రాలేదని వెల్లడించింది. ప్రభుత్వం, యాజమాన్యం ముందు తాము 32 డిమాండ్లను ఉంచామని పేర్కొంది. ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని పలు డిమాండ్లు యాజమాన్యం ముందు ఉంచినట్లు తెలిపారు.

## ఆశా భోంస్లే ఆశయాలకు ప్రతిరూపంగా మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్.. మహారాష్ట్ర సీఎం ప్రకటన



దిగ్గజ గాయని, స్వర్గీయ ఆశా భోంస్లే ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో ఒక మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ ను ఏర్పాటు చేయనున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆశాజీకి ఘన నివాళు లర్పించిన అనంతరం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి సునేత్రా అజిత్ పవార్‌తో పాటు ఇతర కేబినెట్ సభ్యులు పాల్గొన్నారు. సంగీత రంగంలో ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను గతంలో ఆశా భోంస్లే స్వయంగా ప్రభుత్వానికి అందించారని ఫడ్నవిస్ గుర్తుచేశారు. "ఆ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆశా తాయ్ కలలుగన్న ఆ సంస్థను సాకారం చేసేందుకు అవసరమైన అన్ని సానుకూల చర్యలు తీసుకుంటాం" అని ఆయన స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్, ఆశా భోంస్లే మృతికి సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు. అనంతరం కేబినెట్ సభ్యులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆశా భోంస్లేకు నివాళులర్పిస్తూ ఫడ్నవిస్ భావోద్వేగంగా మాట్లాడారు. "ఈరోజు సుమధుర స్వరాల ఉద్యానవనం నిర్మానుష్యంగా మారింది. ఆశా తాయ్ స్వరం సంగీతానికి ఆత్మ లాంటిది" అని అన్నారు. "'తోరా మన్ దర్పణ్ కెహలాయే' వంటి ఆర్ద్ర గీతాల నుంచి 'ఖల్లాస్' వంటి హుషారైన పాటల వరకు ఆమె ప్రతి భావాన్నీ సులభంగా పలికించారు. భక్తి గీతాలు, గజల్స్, క్లాసికల్, పాప్ అనే తేడా లేకుండా అన్నింటిలోనూ తనదైన ముద్ర వేశారు," అని కొనియాడారు. మరాఠీ, హిందీ సహా 20 భారతీయ, విదేశీ భాషల్లో 12,000కు పైగా పాటలు పాడిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె అని ప్రశంసించారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమాన్ని గుర్తుచేసుకుంటూ, "ప్రపంచ రేడియో దినోత్సవం రోజు మేమిద్దరం కలిశాం. అప్పుడు నాతో 'అభీ నా జావో ఛోడ్ కర్...' పాటను బలవంతంగా పాడించి, 'చూశారా, ముఖ్యమంత్రితో పాట పాడించాను' అని సరదాగా అన్నారు. అలాంటి వ్యక్తి ఇక మన మధ్య లేరనే వాస్తవాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉంది" అని ఫడ్నవిస్ అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు, దేశవ్యాప్తంగా ఉన్న అసంఖ్యాక అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## హైదరాబాద్ నగరంలో రికార్డుస్థాయికి విద్యుత్ వినియోగం



హైదరాబాద్ నగరంలో విద్యుత్ వినియోగం ఏప్రిల్ 13న రికార్డు స్థాయికి చేరుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ పరిధిలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. నేడు సాయంత్రం 16.01 గంటలకు జీహెచ్ఎంసీ పరిధిలో 4,381 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ వినియోగం నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ, ఇప్పటి వరకు ఇది అత్యధికం. గ్రేటర్ హైదరాబాద్ చరిత్రలో 2026 మార్చి 3వ తేదీన 4,421 మెగావాట్ల విద్యుత్ వినియోగంతో ఇప్పటి వరకు ఆల్ టైమ్ రికార్డుగా ఉంది. రోజురోజుకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ వినియోగదారులకు అవాంతరాలు ఎదురుకాకుండా విద్యుత్ సరఫరా సాగిస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. భవిష్యత్తులో మరింత డిమాండ్ పెరిగినా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

## రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం: బండి సంజయ్



నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి వాదనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేశారు. "అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్నది రేవంత్ రెడ్డి వాదన. అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లూ ఇవ్వాలా? వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల పరిస్థితి ఏమిటి?" అని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నిధులు పంపి, ఇప్పుడు డబ్బు చుట్టూనే సిద్ధాంతాలు అల్లుతున్నారా? అని ఎద్దేవా చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను కించపరిచేలా ముఖ్యమంత్రి మాట్లాడటం బాధాకరమని, అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. గత 50 ఏళ్లలో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆయన, గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవడంపై నిలదీశారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఇది అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనమని, ఇప్పటికైనా రాజ్యాంగ విలువలపై గౌరవంతో మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## లోక్‌సభ సీట్ల పెంపుపై రేవంత్ ఆగ్రహం



ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దామాషా విధానం కాకుండా మరో సముచిత పద్ధతిని అనుసరించాలని ఆయన కోరారు. అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఏర్పడిన తర్వాతే ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. దేశ ప్రయోజనాలే ప్రతి పార్టీకి ముఖ్యమని ఆయన అన్నారు. ఇక మహిళల విషయంలో బీజేపీ వైఖరిపై కూడా రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ ఏర్పడి దశాబ్దాలైనా ఇప్పటివరకు ఒక మహిళను కూడా పార్టీ అధ్యక్షురాలిగా నియమించలేదని విమర్శించారు. దీనివల్ల మహిళల పట్ల ఆ పార్టీకి ఉన్న గౌరవం ఎంత అనేది స్పష్టమవుతుందని అన్నారు. మహిళలకు ప్రాధాన్యం ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని, ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో దేశం ముందుకు సాగిందని గుర్తుచేశారు. మహిళలకు న్యాయం గురించి మాట్లాడే ముందు బీజేపీ తన పార్టీలో మహిళలకు తగిన స్థానం ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను ఏకం చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. అవసరమైతే ఈ అంశంపై పోరాటం కూడా చేస్తామని హెచ్చరించారు. పార్లమెంటులో ఈ బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తామని సవాల్ విసిరారు. దేశ సమతుల్యతను కాపాడే బాధ్యత తమపై ఉందని, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ముందుండి పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఓట్ల తొలగింపుతో ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అధిక సంఖ్యలో ఓట్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన 'సర్' ప్రక్రియపై భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాలో కొనసాగే హక్కు ఓటరుకు ఉంటుందని, ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ప్రక్రియను వక్రీకరించకూడదని పేర్కొంది. అయితే, 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగించారంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ పిటిషన్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నాయని గుర్తు చేసింది. సరైన ప్రక్రియ లేకుండా ఎన్నికల సంఘం ఏకపక్షంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తోందని, ఈ తొలగింపులపై దాఖలైన పిటిషన్లను సకాలంలో విచారించడం లేదని పిటిషనర్లు ఆరోపించగా, పిటిషనర్లు ఇప్పటికై ట్రైబ్యునళ్లను ఆశ్రయించారని, కాబట్టి ఈ వాదనల్లో పసలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'సర్' ప్రక్రియపై దాఖలైన పిటిషన్లను విచారించేందుకు కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు 19 ట్రైబ్యునళ్లు ఏర్పడినట్లు ఈసీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారించాల్సిన అప్పీళ్ల సంఖ్య 30 నుంచి 34 లక్షల వరకు ఉంటాయని తెలిపింది.అయితే ఈ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తారా లేక గడువును పొడిగిస్తూనే ఉంటారా అని పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ దేశంలో ఓటు రాజ్యాంగపరమైనదే కాకుండా, భావోద్వేగ అంశం కూడా అని పేర్కొంది. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో భాగమని తెలిపింది. ఒక ప్రభుత్వాన్ని ఎంచుకోవడంలో ఇది కీలకమని వ్యాఖ్యానించింది. అలాగే విచారణకు సంబంధించి కాలపరిమితిని నిర్ణయించి ట్రైబ్యునళ్లపై భారం మోపలేమని స్పష్టం చేసింది. అధిక సంఖ్యలో ఓటర్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని తెలిపింది.

## ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య అవగాహనే

ఆయన కొనియాడారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ అధికార బలం పనిచేయలేదని ఎద్దేవా చేశారు. తలసరి ఆదాయం ప్రాతిపదికన అసెంబ్లీ సీట్లు పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఈ ప్రతిపాదన పేదలను, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయడమేనని విమర్శించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళల హక్కులను పట్టించుకోలేదని మండిపడ్డారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని, వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోందని, రానున్న రోజుల్లో సొంత బలంతోనే అధికారం చేపడతామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం లభిస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సరికొత్త చరిత్ర దిశగా భారత్: ప్రధాని మోదీ

అన్ని వర్గాల పురోగతికి మహిళల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఈ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, దేశ ప్రయోజనాలకు సంబంధించినదని స్పష్టం చేశారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు దిశగా త్వరలోనే కార్యాచరణ ప్రారంభమవుతుందని తెలిపారు. నిర్ణీత కాలంలో ఈ బిల్లును అమలు చేసి మహిళలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

## ఇది చొరబాటుదారులను తరిమికొట్టే సమయం

వ్యక్తం చేశారు. పోలింగ్ రోజున ఎవరైనా అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చట్టాన్ని ఉల్లంఘించిన వారిని జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు.దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అక్రమంగా నివసిస్తున్న చొరబాటుదారులను గుర్తించి వెనక్కి పంపిస్తామని తెలిపారు. గతంలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు ఉగ్రవాదం, చొరబాట్ల విషయంలో నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. ప్రస్తుతం మాత్రం దేశ భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని అన్నారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి తమ ప్రభుత్వం గట్టి ప్రతీకారం తీర్చుకుందని పేర్కొన్నారు. దేశాన్ని భయపెట్టే శక్తులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే శక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయని అన్నారు. మహిళల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. రాత్రివేళల్లో కూడా మహిళలు భయపడకుండా తిరిగే వాతావరణాన్ని సృష్టించడం తమ లక్ష్యమని చెప్పారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించనున్నాయని పేర్కొన్న ఆయన, ప్రజలు మార్పు కోసం ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, భద్రత, శాంతి కోసం తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

# వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## -కాలేజీ 90 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయం

## - విద్యార్థుల భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు




వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవం మరియు ఫేర్వెల్ కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, వారు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కాలేజీ 90 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమని, చదువుతో పాటు క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ కనబరచడం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థిలో ఉన్న ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేసుకుంటే వారు జీవితంలో విజయాలు సాధించగలరని సూచించారు.తన విద్యార్థి దశలో ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేసుకుంటూ, తల్లిదండ్రుల కష్టాన్ని గౌరవిస్తూ చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ప్రభుత్వ విద్యాసంస్థలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, గురుకులాలు, జూనియర్ మరియు డిగ్రీ కాలేజీల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు విస్తృత అవకాశాలు కల్పించబడినట్లు పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కూడా అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేసి, స్థానికంగా విద్యను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.ఇకపై నియోజకవర్గంలో పీజీ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్ మరియు ఐటీఐ కాలేజ్ ఏర్పాటు కోసం కృషి చేస్తానని, ఇప్పటికే ప్రభుత్వానికి లేఖలు రాసినట్లు తెలిపారు. కాలేజీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఫీజు రీయింబర్స్మెంట్ అంశంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల ఆలస్యమవడంతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, చిన్న కాలేజీలు కూడా ప్రభావితమవుతున్నాయని తెలిపారు. సుమారు 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసే పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. విద్యార్థులు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫీజులు కట్టమంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి విద్యార్థులపై భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు చదువు ఒక బంగారు అవకాశం అని, ఆ అవకాశాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే ఫండ్స్ విడుదల చేయాలని కోరారు.అంతేకాకుండా, కాలేజీల అభివృద్ధికి స్థానిక నాయకులు సహకరించాలని, విద్యార్థులు బాగా చదివి కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తనను సంప్రదించాలని, ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సిహెచ్. ప్రసాద్ నాయకులు పెద్దబాయి ఆనంద్ రెడ్డి సుర్ణగంటి అర్జున్ రామిడి రామిరెడ్డి పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి లిక్కి కృష్ణారెడ్డి , బోయపల్లి శేఖర్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ కోఆర్డినేటర్లు రామరాజు , వెంకటరెడ్డి , జ్యోతి నరసింహ , నరసింహరాజు అలాగే రేవతి, విజయశ్రీ, సుష్మిత, సురేష్ బాబు, వెంకన్న, రోహిత్ కుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వ సాధనలో బాబాసాహెబ్ బాటలో నడుద్దాం



మహేశ్వరం వార్త మిర్రర్ ప్రతినిధి 13 :- రాజ్యాంగం కేవలం న్యాయవాదుల పత్రం కాదు, అది ఒక జీవన వాహనం, దాని ఆత్మ ఎల్లప్పుడూ యుగపు ఆత్మగా ఉంటుంది"లిలి అని నమ్మిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్.నేడు బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా, రంగారెడ్డి జిల్లాలో బిజెపి దళిత మోర్చా ఆధ్వర్యంలో లిగొల్లూరు మాధవ్లి గారి నేతృత్వంలో నిర్వహించిన పాలాభిషేకం మరియు శుద్ధి కార్యక్రమం కేవలం ఒక ఆచారం కాదు; అది ఆయన పట్ల మనకున్న గౌరవానికి మరియు ఆయన ఆశయాల పట్ల మనకున్న నిబద్ధతకు నిదర్శనం.లిఈ స్ఫూర్తిదాయక కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు:జిల్లా సీనియర్ నాయకులు లిమిద్దె సుదర్శన్ రెడ్డిలి గారు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి లిపోతర్ల సుదర్శన్ యాదవ్లి గారు, మండల అధ్యక్షులు లితెలగమల యాదేశ్లి గారు, మోర్చా మండల అధ్యక్షులు లిరఘువీర్లి గారు, మండల ప్రధాన కార్యదర్శి లివనంపల్లి శ్రవణ్లి గారు, ఉపాధ్యక్షులు లిరూప్సింగ్లి గారు మరియు నాయకులు లిచిందం జంగయ్యలి గారు. వీరితో పాటు అనేక మంది కార్యకర్తలు బాబాసాహెబ్ మార్గంలో నడవాలని సంకల్పించారు.లిఅంబేద్కర్ గారి జీవితం ఇచ్చే పాఠం:లి అత్యంత సామాన్య కుటుంబంలో పుట్టి, సామాజిక వివక్షను ఎదుర్కొని, ప్రపంచం గర్వించే మేధావిగా ఎదిగిన ఆయన జీవితం మనకు ఒకటే నేర్పుతోంది: లి"అడ్డంకులు ఎన్ని ఎదురైనా, విద్య మరియు పోరాటంతో దేనినైనా సాధించవచ్చు. రాజ్యాంగం ద్వారా ఆయన మనకు కల్పించిన హక్కులు, సమానత్వం నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛకు పునాదులు.సమాజానికి సందేశం:మనం అంబేద్కర్ గారికి ఇచ్చే నిజమైన నివాళి కేవలం విగ్రహాలకు పూలమాలలు వేయడం మాత్రమే కాదు; కులమతాలకు అతీతంగా అందరూ సమానంగా ఉండేలా చూడటం, పేదలకు అండగా నిలవడం మరియు విద్య ద్వారా సమాజాన్ని చైతన్యపరచడం. ఆయన నినదించిన లి"బోధించు, సమీకరించు, పోరాడు"లిలి అనే మంత్రాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలి.కుల వివక్ష లేని, అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణమే మనందరి లక్ష్యం కావాలి.బాబాసాహెబ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం, నవ భారత నిర్మాణంలో భాగస్వాములం అవుదాం!

**జై భీమ్! జై భారత్!**

# ఓయూలో ఘనంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం -- అద్భుత స్పందన



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 13: ఉస్మానియా యూనివర్సిటీ హెల్త్ సెంటర్లో సోమవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి విద్యార్థులు, అధ్యాపకుల నుంచి విశేష స్పందన లభించింది. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరం ఆరోగ్య అవగాహనకు వేదికగా నిలిచింది.ఓయూ జేఏసీ నాయకులు తూము నవీన్ యాదవ్, గడ్డం శ్రీనివాస్, డీబీఎస్ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ జంగిలి దర్శన్, టీఎస్పీ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో ఓయూ హెల్త్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతమ్, రాచకొండ డీసీపీ (ఎస్.ఓ.టి) మనోహర్, టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి, తొలి వెలుగు రఘు, కాళోజీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. క్యాన్సర్ను తొలిదశలో గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని వైద్య నిపుణులు తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలు జీవరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని వారు వివరించారు.ప్రత్యేకంగా 30 ఏళ్లు పైబడిన మహిళలు, పొగాకు మరియు మద్యపానం చేసే వారు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, అనుమానాస్పద లక్షణాలు గమనిస్తున్న వారు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నిపుణులు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు, అవగాహన కల్పించారు.ఈ శిబిరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని సేవలు పొందారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రజలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు స్క్రీనింగ్ ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, ఇలాంటి శిబిరాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.మొత్తంగా ప్రజల ఆరోగ్య సంరక్షణ దిశగా ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ఒక సార్థక ప్రయత్నంగా నిలిచింది.

# అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన ఓయూ వైస్ ఛాన్సెలర్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 13: ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో పోస్టర్, పాంప్లెట్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఓయూ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ కుమార్ మొలగరం పోస్టర్, పాంప్లెట్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం ఎంతో అవసరమని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశమున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా అగ్నిమాపక అధికారి-×× ఎ. శ్రీదాస్ మాట్లాడుతూ, ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహించనున్న వివిధ అవగాహన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయంలో పాటించాల్సిన చర్యలపై సవివరంగా వివరించారు.ఈ కార్యక్రమంలో మౌలాలి అగ్నిమాపక కేంద్రాధికారి కె. రామకృష్ణా రెడ్డి, సికింద్రాబాద్ అగ్నిమాపక కేంద్రాధికారి ఎస్. శంకర్, మౌలాలి అగ్నిమాపక కేంద్రానికి చెందిన లీడింగ్ ఫైర్ ఫైటర్స్ పి. గోవిందు, ఎ. సాయి కిరణ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.



# విద్యాభివృద్ధికి మరో అడుగు

## - కల్వకుర్తి శిశు మందిరంలో భూమి పూజ

కల్వకుర్తి, ఏప్రిల్ 13: శ్రీ సరస్వతీ శిశు మందిరం కల్వకుర్తిలో నూతన తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. పెరుగుతున్న విద్యార్థుల ప్రవేశాల కారణంగా కొత్త భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాంత సహ కార్యదర్శి విశ్వేశ్వర రావు గారు పాల్గొని మార్గదర్శనం చేశారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు, పూర్వాచార్యుల భాగస్వామ్యం శుభ పరిణామమని ఆయన తెలిపారు.కార్యక్రమంలో మాధవ రెడ్డి, మురళీధర రెడ్డి, ప్రధానాచార్యులు సేవకుల రాజు గారు, పూర్వ విద్యార్థులు, ఆచార్య బృందం పాల్గొన్నారు.



## పగిడిమర్రి రుక్మ బాయి దశదిన కార్యక్రమంలో పాల్గొన్న - ఉప్పల లింగస్వామి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన పగిడిమర్రి రుక్మా బాయి గారి దశదిన కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు పరామర్శించి రుక్మాబాయి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన సంస్థాన్ నారాయణపురం మండల కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామిఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచకొండ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు



# వాలీబాల్ టోర్నమెంట్ విజేత టిఆర్ బి జట్టు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 13

మహాత్మ జ్యోతిరావ్ బాపూలే అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు ఆవరణలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాయికల్ శాఖ నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ లో టి ఆర్ బి జట్టు ప్రథమ స్థానంలో, ద్వితీయ స్థానంలో తాట్లవాయి గ్రామజట్టు నిలిచాయని ఫిజికల్ డైరెక్టర్ పుర్రె రమేష్ తెలిపారు. విజేతలకు అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 14న రాయికల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహుమతులు అందజేయనున్నట్లు ఆయన వివరించారు. క్రీడల సక్రమనిర్వహణ కు వ్యాయామ ఉపాధ్యాయులు బందెల శ్రీనివాస్, సి.హెచ్ ప్రతాప్, ఆకు రాజేందర్ అనంతుల శ్రీకాంత్, సహకరించారని ఆయన అన్నారు. గెలుపు సాధించిన క్రీడాకారులకు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు నాయకులు ఉపాధ్యాయులు మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ కౌన్సిలర్ పుర్రె శ్రీధర్ తదితరులు అభినందనలు తెలిపారు.




## ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

## -123 మందికి వైద్య పరీక్షలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 13

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ వైద్యులు స్నేహ, గాయత్రి మొత్తం 123 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 21 మందిని కరీంనగర్ నగునూరు ప్రతిమ ఆసుపత్రికి రిఫర్ చేశారు. రిఫర్ చేసిన వారికి మంగళవారం ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, ప్రతిమ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భావన, మార్కెటింగ్ సిబ్బంది ప్రకాష్ రావు, శ్యామల, ఉపసర్పంచ్ మూగల సంజీవచారి, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, గ్రామీణ వైద్యులు జలంధర్, ప్రసాద్, వార్డు మెంబర్లు రాము, కొమురయ్య, శేఖర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

# పురపాలక సంఘం కార్యాలయంలో (అరైవ్ అలైవ్) - రోడ్డు భద్రత"అవగాహన సదస్సు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 13

జగిత్యాల జిల్లా ?రాయికల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు, "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రాయికల్ పురపాలక సంఘం కార్యాలయంలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా వారోత్సవాల సదస్సును సోమవారం నిర్వహించారు. పెరుగుతున్న రహదారి ప్రమాదాలను అరికట్టడానికి వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, అతి వేగాన్ని నియంత్రించుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత మనందరి బాధ్యత' అనే నినాదంతో ప్రజల్లో మార్పు తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని ?రహదారి నిబంధనలు పాటిద్దాం – సురక్షితంగా గమ్యాన్ని చేరుకుందాం అని ఎస్.ఐ సుధీర్ రావు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కట్కం రవీంధర్, మున్సిపల్ కమీషనర్ కీర్తి నాగరాజు,మున్సిపల్ కౌన్సిలర్ల్ తోపారపు ప్రశాంతి, కూనారపు మానస,వేముల మౌనిక, బత్తిని మహేశ్వరీ నాగరాజు, భూక్య రాకేష్ నాయక్ , పల్లికొండ గంగాధర్,ఆర్.ఐ దేవదాస్, నాయకులు బత్తిని నాగరాజు, పురపాలక సిబ్బంది మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## భూపతిపూర్ లో అరైవ్ అలైవ్ ప్రోగ్రామ్

అరైవ్ అలైవ్ ప్రోగ్రామ్ లో భాగంగా ఈరోజు భూపతిపూర్ గ్రామంలో రాయికల్ ఎస్.ఐ సుధీర్ రావు, సర్పంచ్ గుర్రం భావన ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది రోడ్డు ప్రమాదాల నిర్వహణపై ఎస్సై అవగాహన కల్పించి గ్రామ పరిధిలోని రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, గుంతలను పూడ్చి వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ చారి, ఆర్ఐ పద్మయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామ వార్డు మెంబర్లు గ్రామ యువత ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో అంబేద్కర్ ముందస్తు జయంతి వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 13

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను (ఏప్రిల్ 14 పురస్కరించుకొని) ఒక రోజు ముందుగానే సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షత వహించగా, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కిరణ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. చదువుకో, సమీకరించుకో, పోరాడు" అనే నినాదంతో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వసంతరావు, రతిలాల్, లక్ష్మి, రాజశేఖర్, మహేష్, జీవన్ రెడ్డి శంకరయ్య, ఆనంద్, బాలమురళి మల్లారెడ్డి, రజత, కృష్ణ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



# గమ్యస్థానానికి సురక్షితంగా చేరుదాం: సైబరాబాద్ సీ.పీ. డా. ఎం. రమేష్....



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రతి వాహనదారుడు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉన్నత లక్ష్యంతో సైబరాబాద్ పోలీసులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలో సోమవారం నాడు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ స్వయంగా పాల్గొని ద్విచక్ర వాహనదారులు, పాదచారులు మరియు ఇతర వాహనదారులతో నేరుగా ముచ్చటించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ... రక్తసిక్తమైన రోడ్లను చూడటం పోలీసులకు ఏమాత్రం ఇష్టం లేదని, ప్రతి పౌరుడు క్షేమంగా తమ ఇంటికి చేరుకోవడమే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. అంబులెన్సులు అవసరం లేని రోడ్డు వ్యవస్థను నిర్మించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.ద్విచక్ర వాహనదారుల భద్రత గురించి సీపీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, హెల్మెట్ ధరించడం కేవలం ఒక నిబంధన మాత్రమే కాదని, అది ప్రాణ రక్షణ కవచమని గుర్తుచేశారు. కేవలం హెల్మెట్ పెట్టుకుంటే సరిపోదని, దాని స్ట్రాప్ (బెల్ట్) తప్పనిసరిగా బిగించాలని, లేనిపక్షంలో అది ప్రమాద సమయంలో ఎగిరిపోయి రక్షణ కల్పించలేదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు మాత్రమే కాకుండా, వెనుక కూర్చునే వారు మరియు 4 సంవత్సరాల పైబడిన పిల్లలు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అదేవిధంగా కార్లలో ప్రయాణించే వారందరూ, డ్రైవర్‌తో సహా సీటు బెల్టు ధరించడం వల్ల ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని వివరించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడంలో 'డిఫెన్సివ్ డ్రైవింగ్' (రక్షణాత్మక డ్రైవింగ్) కీలక పాత్ర పోషిస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లు కూడా పొరపాట్లు చేసే అవకాశం ఉన్నందున, పరిసరాలను నిరంతరం గమనిస్తూ, ప్రమాదాలను ముందుగానే ఊహించి వాహనాన్ని నియంత్రించడమే డిఫెన్సివ్ డ్రైవింగ్ అని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించేటప్పుడు రిఫ్లెక్టివ్ దుస్తులు ధరించాలని, చిన్న రోడ్ల నుండి ప్రధాన రహదారుల్లోకి వచ్చేటప్పుడు ఇరువైపులా గమనించాలని సూచించారు. రోడ్డుపై వెళ్లే చిన్నపిల్లలు, వృద్ధులు మరియు పాదచారుల పట్ల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.అతివేగం మరియు మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పాదచారులు జంక్షన్ ల వద్ద పోలీస్ సిబ్బంది సహకారంతో జాగ్రత్తగా రోడ్డు దాటాలని సూచించారు.వేగం



పెరిగే కొద్దీ ప్రమాద తీవ్రత పెరుగుతుందని, పాఠశాలలు, ఆసుపత్రులు మరియు కూడళ్ల వద్ద వేగ పరిమితిని తప్పక పాటించాలని సూచించారు. మద్యం లేదా మాదకద్రవ్యాల ప్రభావంతో వాహనం నడపడం ఆత్మహత్యాసదృశ్యమని, అలాగే అలసటతో ఉన్నప్పుడు ప్రయాణించవద్దని సూచించారు. సుదీర్ఘ ప్రయాణాలు చేసే వారు ప్రతి 2 గంటలకు ఒకసారి విరామం తీసుకోవడం వల్ల ఏకాగ్రత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. భారీ వాహనాలు రహదారికి ఎడమ వైపున మాత్రమే ప్రయాణించాలని, ఆకస్మికంగా ఓవర్ టేక్ చేయకూడదని హెచ్చరించారు.చివరగా, రోడ్డుపై వాహనదారులు ప్రదర్శించే క్రమశిక్షణ మరియు సత్ప్రవర్తన ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తాయని సీపీ పేర్కొన్నారు. కోపం, అసహనం వంటి భావోద్వేగాలు డ్రైవింగ్‌పై ప్రభావం చూపుతాయని, తోటి ప్రయాణికులతో, చిరునవ్వు తో మర్యాదగా మెలగాలని సూచించారు. అనవసరంగా హారన్ మోగించి ఇతరులను ఇబ్బంది పెట్టవద్దని, వాహనానికి వాహనానికి మధ్య సురక్షిత దూరాన్ని పాటించాలని కోరారు. ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్న ఈ అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం రావాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను స్వచ్ఛందంగా పాటిస్తూ సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని సీపీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ఐపీఎస్, ట్రాఫిక్-1 డీసీపీ రంజన్ రతన్ కుమార్, ట్రాఫిక్-1 అదనపు డీసీపీ హనుమంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సురేష్, రాయదుర్గం ట్రాఫిక్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ హనిమిరెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు మొదలగువారు పాల్గొన్నారు.

# అనుమతి లేని ఇటుకబట్టి వ్యాపారి రౌడీదందా:

**పోలేపల్లి పంచాయతీ కార్యదర్శి పై రౌడీ యిజం**

**ప్రభుత్వ నోటీసులను లెక్కచేయని ఇటుకబట్టి వ్యాపారి**

**గ్రామపంచాయతీ పాలకవర్గంన్ని లెక్కచేయని వ్యాపారి:**

**గృహ సముదాయాల మధ్యలో ఇరుకబట్టి వ్యాపారం:**

**ప్రభుత్వఅధికారులు, రాజకీయ నాయకులు అండదండలతో వ్యాపారం**


**కార్మిక చట్టాన్ని తుంగలో తొక్కేస్తూ వెట్టి చాకిరి:**


**అర్ధరాత్రి నుండి సూర్యోదయం వరకు ఇటుకల తయారీ:**

**ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ ఇటుక బట్టీ వ్యాపారి:**

**ఇటుక బట్టీ ని తొలగించాలంటూ గ్రామస్తుల ఆందోళన**


**పట్టించుకోని సంబంధిత మండల, ఉన్నతా అధికారులు**





చందంపేట ఏప్రిల్ 13 వార్త మిర్రర్::

దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలం పోలేపల్లి గ్రామం లో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇటుక బట్టి వ్యాపారీ సాగు భూములలో యదేచ్చగా ఏర్పాటు చేస్తే కొల్లగొట్టేస్తున్నారు.అన్నదాతలు అమాయకత్వం ఆర్థిక ఇబ్బందులు ఆసరాగా చేసుకుని విలువైన సాగు భూములను అడ్డు అదుపు లేకుండా తోవ్వేస్తున్నారు. ఈటికబట్టిని మండల,డివిజన్ అధికారులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కూడా ఇటుక బట్టీల దందా మాఫియా ను చూసి చూడనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా ఇటుక బట్టీలకు ఇటుకకు నిర్ణీత ధర అంటూ ఏమీ లేకపోవడంతో అడ్డగోలుగా అమ్మేస్తున్నారు.అదేవిధంగా లైట్ వెయిట్ ఇటుక పేరుతో ఒక్కొక్క ఇటుకను 12 నుంచి 15 వరకు



విక్రయించడంతోపాటు మధ్యతరగతి సామాన్య ప్రజల ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు జంకుతున్నారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలు రూపొందుకోవడంతో ఇటుక బట్టీలు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు పెట్టుబడికి మూడింతలు లాభాలు గడిస్తూ వ్యాపారులు ఎలాంటి ఆదాయ పన్నులు చెల్లించకుండా ప్రభుత్వానికి భారీగా గండి కొడుతున్నారు..

## పోలేపల్లి లో అనుమతి లేని ఇటుక బట్టి::

చందంపేట మండలం కేంద్రంలోని పోలేపల్లి గ్రామంలో ఇటుక బట్టి నిర్వహిస్తున్న నిర్వాహకులు గ్రామపంచాయతీ అనుమతి తీసుకోవాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శి కోరిన సంబంధిత నిర్వాహకులు స్పందించకపోవడం అదేవిధంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఇష్టానుసారంగా మాట్లాడుతూ రాజకీయ నాయకుల అండతో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు బెదిరించడం జరిగింది. ఇదే విషయమై సంబంధిత పంచాయతీ కార్యదర్శి అనుమతి తీసుకోనందుకు నోటీసు ఇచ్చిన ఎటువంటి స్పందన లేకపోవడంతో సంబంధిత పంచాయతీ కార్యదర్శి వారి ఉన్నత అధికారులకు తెలియజేశారు. ఇది ఇలా ఉండగా గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసే బట్టిలకు పంచాయతీ తీర్మానం కూడా తప్పనిసరిగా ఉండాలి అనే నిబంధన ఉన్నప్పటికీ వారిని కూడా దూషిస్తూ పంచాయతీ తీర్మానం సభ్యులను అవమానపరిచే విధంగా మాట్లాడడం జరిగిందని సంబంధిత పంచాయతీ కార్యదర్శి తెలపడం జరిగింది. గ్రామ పరిధిలో గ్రామపంచాయతీ తీర్మానం కాలుష్య నియంత్రణ అధికార అనుమతులు తీసుకోవాలని నిబంధన ఉన్నప్పటికీ అవేమి పట్టించుకోకుండా ఎక్కువ లాభాలు ధరించవచ్చు అన్న ఉద్దేశంతో పోటీపడి ఇటుక బట్లను గృహ సముదాయాల మధ్య ఏర్పాటు చేస్తున్నారు. అటవీ ప్రాంతం చెరువులో కాలువలకు సమీపంలో బట్టలు



ఏర్పాటు చేస్తూ విలువైన వనరులను కొల్లగొట్టేస్తున్నారు. ఇటుకల తయారీకి అనువైన మట్టిని ఇష్టారాజ్యంగా తవేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగవేస్తూ లక్షల రూపాయలు ఆదాయాన్ని వెనకేసుకుంటున్నారు.

## అధికారుల కనుసన్నల్లోనే ఇటుక బట్టి:::::

రాష్ట్ర ప్రభుత్వం రైతన్న ఆదుకునేందుకు నిరంతరంగా వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుంది కానీ కొందరు వ్యాపారాలు అధికారులకు విద్యుత్తు దుర్వినియోగం చేస్తున్నారు అనే ఆరోపణలు వస్తున్నాయి.ఇటుక బట్టీల వ్యాపారం చేసే యజమానులు విద్యుత్ శాఖ నుండి ప్రత్యేక అనుమతులు పొందిన తర్వాతనే విద్యుత్ ను వాడుకోవాల్సి ఉంటుంది. అలా కాకుండా స్థానిక విధులు నిర్వహించే విద్యుత్ శాఖ సిబ్బంది మామూలుతో ఎరా వేస్తూ ఉచిత విద్యుత్ కి పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.దీంతో విద్యుత్ శాఖ కూడా లక్షల రూపాయలు కోల్పోవాల్సి వస్తుంది. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ లేకపోవడం అక్రమ విద్యుత్ వాడకానికి అడ్డు అదుపు లేకుండా పోతుందని విమర్శలు వస్తున్నాయి.కొంతమంది రైతులు ఇటుకబట్టిలో యజమానులకు సాగు భూములను ఇవ్వడంతో వ్యవసాయ మోటార్ నుంచి ఇటుక బట్టీలకు సరఫరా చేస్తున్నారు. వలస కూలీలతో నిబంధనలు విరుద్ధంగా వెట్టి చాకిరి చేస్తూన్న కార్మిక శాఖ అధికారులు కన్నెత్తించడం చూడడం లేదు అంతేకాకుండా కార్మికులను మధ్య రాత్రి 1:00 నుండి ఉదయం 10 గంటల వరకు పనిచేస్తున్నారని కార్మికులు తెలుపుతున్నారు. అంతేకాకుండా వారికి కార్మిక చట్టం ప్రకారం వారికి ఉండాల్సిన లేబర్ కార్డు, వారి పిల్లలకు సరైన విద్య అందించకపోవడం వారికి అవసరమైన ప్రాథమిక చికిత్స అవసరాలు కూడా లేవని కార్మికులు తెలుపుతున్నారు.

# ఏప్రిల్ 15న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 13జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డెలింగాపూర్ సబ్ స్టేషన్లో తేది 15-4-2026 బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (జ+=ఫ్రీ) నిర్వహించనున్నట్లు ఛైర్ పర్సన్ ఎరుకల నారాయణ తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యల అర్జీలను ప్రత్యక్షంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వడ్డెలింగాపూర్, రాయికల్, బీర్పూర్, సారంగాపూర్ సెక్షన్ల విద్యుత్ వినియోగదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

# అంబేద్కర్ జయంతి రోజున మద్యం విక్రయాలపై వివక్ష ఆరోపణలు



ఉప్పల్, వార్తా మిర్రర్ ఏప్రిల్ 13 :

దేశంలో ఇప్పటికీ సామాజిక వివక్ష కొనసాగుతూనే ఉందని, ప్రభుత్వాల విధానాలు కూడా అదే దిశగా ఉన్నట్లుగా అనిపిస్తున్నాయని బహుజన నాయకుడు సుద్దాల సురేష్ ఆరోపించారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలను తెరిచి ఉంచడం వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు.ఆయన మాట్లాడుతూ... మహాత్మా గాంధీ జయంతి రోజున మద్యం దుకాణాలు మూసివేయడం ఆనందకరమైన విషయమైతే, అదే విధానం అంబేద్కర్ జయంతి రోజున అమలు చేయకపోవడం వివక్షతకు నిదర్శనమని విమర్శించారు.ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ మరియు బహుజన వర్గాలు మద్యం వినియోగంలోనే ఉండాలని ప్రభుత్వాలు భావిస్తున్నట్లుగా అనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో సుమారు 85 శాతం బహుజనులు ఉన్నప్పటికీ, వారి భావజాలాన్ని ప్రతిబింబించే విధంగా నిర్ణయాలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. అంబేద్కర్ ఆలోచనలను గౌరవించాలంటే ఆయన జయంతి రోజున మద్యం విక్రయాలను నిషేధించాలని, జీవహింసకు కూడా తావులేకుండా చర్యలు తీసుకోవాలని సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు.ఈ విషయంపై అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు స్పందించకపోవడం కూడా ఆశ్చర్యకరమని ఆయన పేర్కొన్నారు.



# తాజ్ పూర్ గ్రామపంచాయతీలో రోడ్డు భద్రత గ్రామసభ

## ఇంట్లో నుంచి బయటికి వెళ్తే హెల్మెట్ అందించే బాధ్యత భార్యలు తీసుకోవాలి- సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధిభువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక తాజ్ పూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈ రోజు రోడ్డు భద్రత కు సంబంధించిన అవగాహనా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్ల పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని, మద్యం త్రాగి వాహనాన్ని నడపకూడదని, అతి వేగం ఎంతో ప్రమాదకరమని, సూచించడం జరిగింది. అదేవిదంగా సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, అందరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,పలు సూచనలు,జాగ్రత్తలు గ్రామ ప్రజలకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమం లో సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి బి, నరేందర్, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ,వార్డుసభ్యులు పల్లెపాటి క్రిష్ణ, మహ్మద్ గాలిబీ యాకుబ్, బొమ్మారపు రామక్రిష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజ్, బీట్కూరి మహేష్, వరిగంటి మానస నాగరాజు, షేక్ అహ్మద్ మరియు గ్రామ పెద్దలు, గ్రామప్రజలు యువకులు, మహిళ లు పాల్గొనడం జరిగింది......

# అంబేద్కర్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకుడి నివాళి.. రజక సంఘం స్టేట్ కన్వీనర్ కొన్నే సంపత్



సికింద్రాబాద్, వార్తా మిర్రర్ ఏప్రిల్ 13 ...డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా బీజేపీ స్టేట్ రజక సెల్ కన్వీనర్ నివాళులర్పిస్తూ... భారత రాజ్యాంగ రూపకర్త, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన సమానత్వం, స్వాభిమానం, విద్య అనే మార్గాలు భారతదేశ అభివృద్ధికి శాశ్వత దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు హక్కులు, అవకాశాలు కల్పించడంలో ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు.అంబేద్కర్ ఆలోచనలను ప్రతి భారతీయుడు ఆచరణలో పెట్టాలని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. "శిక్షణ పొందండి, సంఘటితమవండి, పోరాడండి" అనే ఆయన సందేశం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ, దేశ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర ఎప్పటికీ చిరస్మరణీయమని తెలిపారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకుడు కేదార్.. ఘన నివాళి



సికింద్రాబాద్, వార్తా మిర్రర్, ఏప్రిల్ 13:

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు గునిగంటి కేదారి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాతగా, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడిగా అంబేద్కర్ నిలిచారని పేర్కొన్నారు. సమానత్వం, స్వాభిమానం, విద్య అనే విలువలను ఆయన దేశానికి అందించారని తెలిపారు. సమాజంలోని అణగారిన వర్గాలకు హక్కులు, అవకాశాలు కల్పించడంలో అంబేద్కర్ పాత్ర అపారమని కొనియాడారు. ఆయన చూపిన మార్గం నేటికీ సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని అన్నారు."శిక్షణ పొందండి, సంఘటితమవండి, పోరాడండి" అనే అంబేద్కర్ సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కి ఘన నివాళులు అర్పిస్తూ, దేశ నిర్మాణంలో ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కేదార్ పేర్కొన్నారు.